నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, శుక్రవారం 20 జూన్ 2025 | KHAMMAM

23న జీపీల ఎదుట ధర్నా

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూన్ 19 : జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ఆయా కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మురుగు కాల్వల్లో చెత్తను తొలగించాలని, వీధులు, మంచినీటి బావుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయాలనే డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'స్థానిక' గెలుపు కోసమే కాంగ్రెస్ ఎత్తులు

- కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రైతుబంధు అమలు చేయాలి
- వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడానికి 'భట్టి'కి సమయం లేదా?
- విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, జూన్ 19 : అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎత్తులు వేస్తోందని, ప్రజలు వారి మాటలు, ఎత్తులు నమ్మే పరిస్థితిలో లేరని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 90 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రంలో 18 నెలల పాలన పూర్తయినా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చినా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే పరిస్థితి లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే రైతుబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రులను ప్రారంభించడానికి డిప్యూటీ సీఎంకు సమయం ఉంది కానీ.. పూర్తయిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడానికి ఎందుకు సమయం లేదో చెప్పాలన్నారు.

గత కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించిందని ఆయన గుర్తు చేశారు. మధిరలో ఆనాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ట్యాంక్ బండ్‌ను సుందరంగా తీర్చిదిద్దితే.. నిర్వహణ లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా తయారైందన్నారు. మధిర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ప్రభుత్వం రూ.123 కోట్లు కేటాయించిందని, అయితే దీనిపై ప్రజలకు అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. విమర్శలకు తావు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు. సమావేశంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, రైతుబంధు మాజీ కన్వీనర్ చావా వేణు, యన్నంశెట్టి అప్పారావు, ఉమామహేశ్వర రెడ్డి, కోనా నరేందర్‌రెడ్డి, సత్యంబాబు, ఖురేష్, లంకెమల్ల నాగేశ్వరరావు, కొత్తపల్లి నరసింహారావు, జగన్మోహన్‌రావు, ముత్తారు ప్యారీ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్.. ఫిట్‌నెస్!

తాము బండెడు కష్టాలు పడినా తమ పిల్లలకు మాత్రం మరింత మెరుగైన విద్యనందించాలని కలలుగంటున్నారు నేటి తల్లిదండ్రులు. ఇందుకోసం తాము ఒకపూట పస్తులుండైనా సరే.. తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాలని ఆరాటపడుతున్నారు. అందుకోసం తాము చెమటోడ్చి పోగుచేసిన మొత్తాన్ని ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దాహానికి ధారగా పోస్తున్నారు. కానీ, కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం.. అందుకు తగినట్లుగా పసిపిల్లలకు సురక్షిత ప్రయాణాన్ని అందించడంలేదు. రవాణా శాఖ నిబంధనలను పాటించకపోవడం, అనుభవ లేమి, లైసెన్స్ లేని డ్రైవర్లను నియమించుకోవడం, వారి వచ్చీరాని డ్రైవింగ్‌తో పిల్లలను స్కూళ్లకు, ఇళ్లకు రవాణా చేస్తుండడం, ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడం, కొన్నిసార్లు పిల్లలు గాయపడుతుండడం, మరికొన్ని సార్లు ప్రాణాలూ కోల్పోతుండడం వంటివి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏటా జరుగుతూనే ఉండడం ఆందోళనకరం.

– ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ చుంచుపల్లి, జూన్ 19

కొత్తగూడెంలో స్కూల్ బస్ ఫిట్‌నెస్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్థ్యంలేని బస్సుల్లో పిల్లలను రవాణా చేస్తున్న స్కూళ్ల బాధ్యులు
అనుభవం, లైసెన్స్ లేని డ్రైవర్లకు చిన్నారుల రవాణా బాధ్యతలు
ఫలితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏటా పెరుగుతున్న ప్రమాదాలు
ఫీజులు భారీగా తీసుకుంటూనే కనీస ప్రమాణాలు పాటించని స్కూళ్లు
ఆటోల్లోనూ పరిమితికి మించి, ప్రమాదకరంగా పాఠశాలలకు విద్యార్థులు
ఖమ్మంలో 45 రోజులుగా బడి బస్సుల ఫిట్‌నెస్ పత్రాల పరిశీలన ప్రక్రియ
'భద్రాద్రి'లోని 264 బస్సుల్లో 191 బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు పూర్తి
ఇంకా 73 బస్సులకు పెండింగ్.. మరి పిల్లలకు సురక్షిత ప్రయాణమెలా?

తాము తిన్నా తినకున్నా తమ పిల్లలకు మాత్రం బంగారు భవిష్యత్తునివ్వాలని తాపత్రయంతో ఎండవానల్లో విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నారు తల్లిదండ్రులు. అందుకోసం తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించి రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్నారు. కానీ.. ఆయా స్కూళ్ల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా తమ పిల్లలే ప్రమాదాల భారిన పడుతున్నారు. ఒక్కపైసా తక్కువ చేయకుండా బస్సు ఫీజులు తీసుకుంటున్న స్కూళ్ల యాజమాన్యాలు.. బడి పిల్లలను రవాణా చేసే బస్సుల విషయంలో మాత్రం భద్రతా ప్రమాణాలను పాటించడం లేదు. సామర్థ్య పరీక్షలు చేయించని బస్సుల్లో బుడిబుడి అడుగుల పిల్లలను ఎక్కించి రవాణా చేస్తున్నాయి. సామర్థ్యం లేని బస్సులను.. వాహనం నడిపే అర్హతలేని, అర్హత పత్రాలు(లైసెన్స్) లేని డ్రైవర్లకు ఇచ్చి పిల్లలను అందులో ఎక్కిస్తున్నాయి. కానీ.. వీటిలో ఏ కారణంగా ప్రమాదం జరిగినా ఫలితం మాత్రం పిల్లలు అనుభవిస్తున్నారు. మూల్యం మాత్రం తల్లిదండ్రులు చెల్లించుకుంటున్నారు.

క్షేమంగా ఇంటికి చేరేదాకా కళ్లలో ఒత్తులు..

తాము బండెడు కష్టాన్ని మోసి తమ పిల్లలను ప్రైవేటు బడికి పంపిస్తే.. వారు తిరిగి వచ్చేదాకా తల్లిదండ్రుల్లో ఆందోళనే. వారు క్షేమంగా, సురక్షితంగా ఇంటికి చేరుకునేదాకా కళ్లలో ఒత్తులేసుకొని ఎదురుచూపులు చూడక తప్పని పరిస్థితి. ఉదయం 'బై' చెప్పి బడి బస్సు ఎక్కిన తమ చిన్నారి.. తిరిగి సాయంత్రం అదే బస్సు దిగి 'అమ్మా/నాన్నా..' అనుకుంటూ గుమ్మం ముందుకు చేరుకునేదాకా దిగాలే. ప్రైవేటు పాఠశాలలకు వాటి బస్సుల్లో వెళ్తూ.. వస్తూ ఉన్న అభం శుభం తెలియని పసిప్రాయాలు.. డ్రైవర్ల అనుభవరాహిత్యం, బస్సుల సామర్థ్య రహితం వంటి కారణాలతో గాలిలో దీపాలైన దుర్ఘటనలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేకం. ఈ అనుభవ పాఠాల రీత్యా తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సురక్షిత ప్రయాణం గురించి దిగులు పడుతుంటారు. కానీ.. స్కూళ్ల యాజమాన్యాలు మాత్రం పట్టింపులేనితనాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం..

బడి బస్సులు రాని ప్రాంతాల్లో ఆటోవాలాలు బడి పిల్లలను తమ ఆటోల్లో ఎక్కించుకొని పాఠశాలల వద్ద దింపుతున్నారు. తల్లిదండ్రులు వద్దని వారిస్తున్నా ఆటోవాలాలు మాత్రం తమ ఆటోల్లో పది నుంచి పదిహేను మంది వరకూ ఎక్కించుకొని తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. ఆటో అయితే కాస్త తక్కువ ఖర్చుతో పిల్లలను బడికి పంపవచ్చనుకుంటున్న కొందరు తల్లిదండ్రులు.. ఆటో నిండా పిల్లలను ఎక్కించినా మారుమాట్లాడడం లేదు. కానీ.. అనుకోని ప్రమాదాలు జరిగితే మాత్రం వారే మూల్యం చెల్లించుకుంటున్నారు. ఎక్కువమందిని ఎక్కించుకొని వెళ్తేనే గిట్టుబాటు అవుతుందనుకుంటూ ఆటో డ్రైవర్లు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇక ట్రాఫిక్ పోలీసులూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పీడీఎస్‌యూ ధర్నా

ఖమ్మం జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా విద్యార్థులను రవాణా చేస్తున్న ప్రైవేటు పాఠశాలల బస్సులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సామర్థ్యంలేని బస్సులు నడుపుతూ పిల్లల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అలాంటి బస్సులను సీజ్ చేయాలంటూ రవాణా శాఖ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.

ఫిట్‌నెస్‌లేని బస్సులపై చర్యలు తీసుకోవాలంటూ ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

యాజమాన్యాల నిర్లక్ష్యాలు..

ఫీజుల విషయంలో 'తగ్గేదేలే..' అంటూ తల్లిదండ్రుల ముక్కు పిండుతున్న యాజమాన్యాలు.. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. పాఠశాలల ప్రారంభానికి ముందే తమ బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించి సిద్ధంగా ఉంచాల్సిన యాజమాన్యాలు.. అంతులేని లక్ష్యంతో ఉంటున్నాయి. ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో 45 రోజులుగా బడి బస్సుల సామర్థ్య పరీక్షలు కొనసాగుతున్నప్పటికీ.. సుమారు వెయ్యి బస్సుల్లో ఇంకా కొన్ని బస్సులు ఫిట్‌నెస్ టెస్టులకు వస్తుండడం గమనార్హం. అంటే ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమైనా ఈ వారం రోజులుగా ఆయా బస్సులు సామర్థ్య పరీక్షలు లేకుండానే విద్యార్థులను రవాణా చేస్తున్నాయన్నమాట. భద్రాద్రి జిల్లాలో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఆ జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు 264 ఉండగా.. గురువారం నాటికి 191 బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకా 73 బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించాల్సి ఉంది. అయినప్పటికీ ఆ బస్సులు బడి పిల్లలను రవాణా చేస్తూ ఉండడం గమనార్హం.

'భద్రాద్రి'లో ఇంకా 73 బస్సులకు ఫిట్‌నెస్ పెండింగ్

భద్రాద్రి జిల్లాలో మొత్తం 264 బడి బస్సులు ఉన్నాయి. వాటిలో ఇప్పటివరకు 191 బస్సులకు ఫిట్‌నెస్ చేయించారు. మిగతా 73 బస్సులకు ఇంకా చేయించాల్సి ఉంది. అయితే, జిల్లాలో బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించేందుకు కొన్ని విద్యాసంస్థలు అంతగా ఆసక్తి చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నిబంధనల ప్రకారం వాహనం ఫిట్‌నెస్ చేయకుంటే రోజుకు రూ.50 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అయినా విద్యాసంస్థల్లో చలనం కనిపించకపోవడం గమనార్హం. సామర్థ్య పరీక్షల ధ్రువపత్రం లేకుండా రోడ్డెక్కే బడి బస్సులను సీజ్ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు పెడచెవిన పెడుతున్నాయి. చాలా బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు లేవు. కొన్ని బస్సుల్లో పెట్టెలు ఉన్నప్పటికీ వాటిల్లో మందులు లేవు. చాలా బస్సులకు ఇండికేటర్లు పగిలిపోయి ఉన్నాయి. అరిగిన టైర్లు, పగిలిన సైడు మిర్రర్లు దర్శనమిస్తున్నాయి.

నిబంధనలు ఇవే..

- మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రసీదు, పొల్యూషన్ అండ్ కంట్రోల్ సర్టిఫికెట్‌తోపాటు డ్రైవింగ్ లెసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను తప్పనిసరిగా బస్సులో ఏర్పాటు చేయాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. 60 ఏళ్ల వయసు మించకుండా చూసుకోవాలి. తప్పకుండా కంటి పరీక్షలు జరిపించాలి.
- డ్రైవర్లకు పాఠశాలల యాజమాన్యాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్సును స్కూల్ యాజమాన్యం తప్పకుండా తనిఖీ చేయాలి.
- డ్రైవర్ వివరాలను పేరెంట్స్ కమిటీకి అప్పగించాలి.
- సురక్షిత ప్రయాణం కోసం అటు డ్రైవర్‌కు, ఇటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి బస్సులో విద్యార్థులకు అటెండెన్స్ తీసుకోవాలి.
- పది బస్సులకు ఒక అదనపు బస్సును ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి నెలా స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సును తనిఖీ చేయాలి.
- బస్సు నిర్వహణపై రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి.
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు.
- బస్సు బ్యాటరీ, వైపర్స్, ఇండికేటర్లు పనిచేసేలా చూసుకోవాలి.
- బస్సులకు తప్పక పసుపు రంగు వేయాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

నిబంధనలు పాటించని పాఠశాలల బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డెక్కనివ్వం. ప్రతి బస్సుకూ పార్కింగ్ లైట్లు, బస్సులో ఒక సహాయకుడు ఉండేలా చూస్తాం. ప్రయాణించే విద్యార్థుల చిరునామా, ఫోన్ నంబర్, చార్టు రూపంలో ఏర్పాటు చేయాలి. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, పొల్యూషన్, బీమా పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్టీఏ అధికారులు జారీ చేసిన సామర్థ్య పరీక్షల ధ్రువపత్రాలు బస్సుల్లో అందుబాటులో ఉంచాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు.

– పి.వెంకటరమణ, డీటీవో, భద్రాద్రి

నిబంధనలకు అనుగుణంగా భూ సమస్యలు పరిష్కరించాలి

ఏదులాపురం రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

దరఖాస్తుదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం రూరల్, జూన్ 19 : భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను భూభారతి చట్టం నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఏదులాపురం గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకున్న కలెక్టర్.. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. అలాగే ఏదులాపురం చెరువు శిఖం కబ్జాపై ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం ఏదులాపురం చెరువు, మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్ పంపుహౌస్‌ను పరిశీలించారు. భవిష్యత్ తరాల కోసం చెరువు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గ్రామంలోని పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేశారు. పల్లె దవాఖాన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సబ్ సెంటర్ పరిధిలో రోగులు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, దవాఖానలో మందుల నిల్వల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

బోనకల్లు ఠాణా ఎదుట ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు, మహిళలు

బోనకల్లు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, బాధిత కుటుంబ సభ్యులు

బోనకల్లు, జూన్ 19 : బ్రాహ్మణపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల దాడులు, దౌర్జన్యాలను తట్టుకోలేక బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, బాధితులు, మహిళలు బోనకల్లు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని గురువారం ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మడుపల్లి వెంకటేశ్వర్లు వారం రోజుల క్రితం ఆటోలో వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పెద్దప్రోలు సైదులు, అతడి కుమారుడు కార్తీక్‌లు ఆటోను ఆపి ఇనుప రాడ్‌తో వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలతో అప స్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిపై ప్రశ్నించిన వెంకటేశ్వర్లు తల్లి రాధమ్మపై కూడా దాడికి దిగడంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పోలీసులు వారిని పిలిపించి విచారణ చేపట్టలేదని బాధితులు ఆరోపించారు. దీంతో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, బాధిత కుటుంబ సభ్యులు గురువారం బోనకల్లు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కాంగ్రెస్ నాయకులతో తమకు ప్రాణభయం ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని ఎస్సై వెంకన్నను వేడుకున్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జెర్రిపోతుల రవీందర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వంగాల కృష్ణ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు, అతడి తల్లిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వంగాల సీత, బీఆర్ఎస్ నాయకులు రామిశెట్టి రవికుమార్, గుడిద శ్రీరామ్, ఎనమద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్త పరీక్షలపై అవగాహన కల్పించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, జూన్ 19 : ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనులకు రక్త పరీక్షలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గూడేల్లో పిల్లలకు ఎక్కువగా సికిల్ సెల్ ఎనీమియా వ్యాప్తి చెందుతుందని, ఇది పిల్లల నుంచి పెద్దల వరకు విస్తరిస్తుందని, దీనిని మొదట్లోనే గుర్తించి సరైన వైద్య పరీక్షలు చేయించుకుంటే నివారించవచ్చన్నారు. అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ముఖ్యమైన కూడళ్లలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి సికిల్ సెల్ ఎనీమియా టెస్టులు చేయించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రావు, పీవో రాహుల్ మాట్లాడుతూ 130 పంచాయతీల్లో క్యాంపులు నిర్వహించి ప్రతీ ఒక్కరికి పరీక్షలు చేయించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీలోని గిరిజన గ్రామాలు, గూడేల్లో ప్రతీ ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ నాయక్, ఏసీఎంవో రమణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఏడీఎంహెచ్‌వో చైతన్య, సికిల్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్, ఆర్ఎంవో రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

12 మంది మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 19 : మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోవడంతో 12 మంది మావోయిస్టులు జిల్లా పోలీస్, సీఆర్‌పీఎఫ్ 81వ, 141వ బెటాలియన్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని హేమచంద్రాపురంలో గల పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తున్న పునరావాస పథకాల గురించి తెలుసున్న పలువురు మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీకి చెందిన 12 మంది సభ్యులు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. వారిలో ఇద్దరు డివిజనల్ కమిటీ(డీవీసీ) సభ్యులు, నలుగురు ఏరియా కమిటీ సభ్యులు(ఏసీఎం), ఇద్దరు పార్టీ సభ్యులు, ఇద్దరు మిలీషియా సభ్యులు, ఇద్దరు రివల్యూషనరీ పీపుల్స్ కమిటీ(ఆర్‌పీసీ) సభ్యులు ఉన్నారని తెలిపారు. డివిజనల్ కమిటీ సభ్యులైన మడకం రామ అలియాస్ మాడా అలియాస్ రఘు దక్షిణ బస్తర్ డీవీసీలోని 8వ ప్లాటూన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా, మడకం భీమా అలియాస్ శ్రీకాంత్ పడమర బస్తర్ డీసీసీలోని 2వ కంపెనీకి డీవీసీఎంగా వ్యవహరిస్తున్నాడు. వీరిద్దరిపై చెరో రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉందని, మిగతా నలుగురు ఏరియా కమిటీ సభ్యుల్లో ఒక్కొక్కరిపై రూ.4 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.3 లక్షలు అందజేసినట్లు తెలిపారు. క్యాడర్లలో ఉన్న మావోయిస్టులకు త్వరలోనే వారికి ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు తెరిచి అందులో నగదు జమ చేస్తామని వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 294 మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోయారని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) గోపతి నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ 81వ బెటాలియన్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్ సింగ్, 141వ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ పత్రాస్ పుర్తి, చర్ల సీఐ ఆలెం రాజువర్మ, ఆర్ఐ(అడ్మిన్) బోలెం రవి, పోలీస్ పీఆర్వో దాములూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడే... మీ చిన్నారులు ఎదుగుతారు వారి ఆకాంక్షలకు అనుగుణంగా...
రెజొనెన్స్
Info School
VDO's Colony,
KHAMMAM.
HIGHLIGHTS
Soft Skills Development
Creative Learning
Labs With Latest Facilities
Great Personality Values
Complete Command on Subjects
Logical Thinking
Innovative, Student Friendly & Stress Free Education
State, CBSE, ICSE Syllabuseలను Integrate చేసిన IIT, Olympiad Programme & Study Material
అన్ని విధాలుగా...
విద్యార్థి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ జరిగేలా శిక్షణ...
రెజొనెన్స్‌లో కాకపోతే మరెక్కడ?
YOGA
MUSIC
DANCE
DRAWING
SPORTS
LANGUAGE LABS